

తమ్ముడు కోసం..

ఓ వ్యక్తి తమ్ముడు కోసం తప్పుడు మార్గం ఎంచుకున్నాడు. పోలీసుల చేతికి చిక్కాడు.

- 8లో



మట్టి మాఫియా

మట్టి మాఫియా రెచ్చిపోతోంది. ఎర్రమట్టి దిబ్బలను దోచుకుంటోంది.

- 8లో

శ్రీముఖలింగంలో ఘనంగా పడియా

జలుమూరు: శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం స్వామికి పడియా కార్యక్రమాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి ఆలయ అధికారులు, అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే వారాహి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వీటితోపాటు శివరాత్రి జాగరణ చేసిన శివ భక్తులు వేకువ జాము నుంచి స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో వచ్చారు. మూడో రోజు శుక్రవారం స్వామిని పుణ్య స్నానాలకు తీసుకువెళ్లేందుకు నంది వాహనం సిద్ధం చేశారు.

న్యూస్‌రీల్

టెక్కలి సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్



సస్పెన్షన్‌కు గురైన టెక్కలి సబ్ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు

టెక్కలి: టెక్కలి సబ్ రిజిస్ట్రార్ మత్స్య ఉమామహేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో మందస మండలం నుంచి టెక్కలి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఉమా మహేశ్వరరావుపై అనేక అవినీతి ఆరోపణలు చోటు చేసుకున్నాయి. మందస మండలంలో పనిచేసిన కాలంలో అక్కడ దళారీలుగా వ్యవహరించిన కొంత మందితో టెక్కలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎనీవేర్ ప్రక్రియ చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ అడ్డగోలు వ్యవహారంపై 'ఏం జరుగుతోంది' అనే కథనం సాక్షిలో వెలువడింది. దీనిపై ఉన్నతాధికారులు దర్యాప్తు నిర్వహించారు. ఈ దర్యాప్తులో భాగంగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్ వెసులుబాటుతో డబుల్ రిజిస్ట్రేషన్లు, అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తేలడంతో సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇదే ఎస్ఆర్‌ఓ గతంలోనూ ఒకసారి సస్పెన్షన్‌కు గురయ్యారు.

వీధుల్లోకి ఆస్పత్రి మురుగునీరు



కోవెలవీధిలో ప్రవహిస్తున్న ఆస్పత్రి మురుగు

నరసన్నపేట: స్థానిక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన మురుగు నీరు పక్కనే ఉన్న కోవెలవీధిలోకి వస్తోంది. దీంతో ఆ దుర్వాసనకు స్థానికులు తట్టుకోలేకపోతున్నారు. దీనిపై చాలాసార్లు ఆస్పత్రి సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. ఆస్పత్రి వార్డుల్లో రోగులు, ఆస్పత్రి సిబ్బంది వినియోగిస్తున్న బాతురూమ్‌లు, టాయిలెట్ల నీరు ఇలా వీధి మధ్యలోకి వదిలేయడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎన్నికలు ప్రశాంతం: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిశాయని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు 31 పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోలింగ్ సరళి, భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలసి ఎస్పీ సందర్శించారు. అనంతరం ఎచ్చెర్లలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం కేంద్రాన్ని సందర్శించారు. పోలింగ్ ముగిసిన అనంతరం ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ బాక్సులను సురక్షితంగా విశాఖపట్నంలోని ఇంజినీరింగ్ కళాశాలలో భద్రపరిచేందుకు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్‌ల ఎస్కార్ట్ సహాయంతో తరలించారు. ఎస్పీతో పాటు జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, డీవీవీఎస్ఎన్ మూర్తి, వెంకటఅప్పారావుల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు విధులు నిర్వర్తించారు.



పొందూరు: రెడ్డిపేట వద్ద చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

● రెప్పపాటు ప్రమాదాలు..

శివరాత్రి మరునాడు జిల్లాలో రెండు రెప్పపాటు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పాలకొండ నుంచి విశాఖపట్నం వెళ్తున్న బస్సు పొందూరు మండలంలోని రెడ్డిపేటకు చేరుకునే సరికి డ్రైవర్ కాస్త రెప్ప వాల్చడంతో చెట్టును ఢీకొట్టింది. బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. తొమ్మిది మందికి గాయాలు కాగా..పెద్ద ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కానీ మరో ప్రమాదంలో మాత్రం మృత్యుదేవత కరుణించలేదు. శ్రీకాకుళానికి చెందిన దంపతులు బైక్‌పై దైవ దర్శనాలకువెళ్లి వస్తుండగా ఎచ్చెర్ల బైపాస్ రోడ్డు వద్ద అంబులెన్స్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనకు కారణం కూడా అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తేనని సమాచారం. ఈ బండి హైదరాబాద్ నుంచి పశ్చిమ బెంగాల్ వెళ్తోంది. - పొందూరు/ఎచ్చెర్ల క్యాంపస్



జాతీయ రహదారిపై అంబులెన్సు ఢీకొట్టడంతో నుజ్జయిన బైక్

కంప్యూ'ధర్'



కంప్యూటర్ మా తల్లి ప్రతి ఇంటిలోనూ ప్రత్యక్షమవుతోంది. డెస్క్‌టాప్ రూపంలో కాకపోయినా ల్యాప్‌టాప్ రూపంలోనో క్రోమ్‌బుక్ రూపంలోనో కొలువై తీరుతోంది. కానీ అతి సర్వత్ర వర్జయేత్ అన్నారు కదా.. అది కంప్యూటర్‌కు కూడా వర్తిస్తుంది. స్క్రీన్‌కు కళ్లకు అప్పగింతలు అయ్యేలా, కీ బోర్డుకు వేళ్లు అతుక్కుపోయేలా గంటల తరబడి గణన యంత్రంతో సావాసం చేస్తే కొత్త కొత్త జబ్బులు పుట్టుకుని వస్తాయి. వీటిపై అవగాహన కల్పించడానికే ఫిబ్రవరి నెల ఆఖరి రోజును కేటాయించుకున్నారు. జాగ్రత్తలు పాటిస్తేనే అది కంప్యూటర్.. లేదంటే కంప్యూ'ధరే' అని నిపుణులు అంటున్నారు.

- అతి కంప్యూటర్ వినియోగం ఆరోగ్యానికి హానికరమే
- అతిగా చూస్తే కళ్లు, వెన్నెముక, చర్మ సమస్యల బారిన పడే అవకాశం

నేడు కంప్యూటర్ రిలేటెడ్ ఇంజ్యూరీస్ ఎవేర్‌నెస్ డే



టెక్కలి:

కంప్యూటర్‌తో సావాసం పెరుగుతోంది. ఉద్యోగ రీత్యా, కాలక్షేపం కోసం, అదనపు ఆదాయం కోసం కంప్యూటర్ వినియోగం యువతలో బాగా పెరిగింది. కానీ అది కాస్తా జబ్బులకు దారి తీస్తోంది. అదే పనిగా కంప్యూటర్ వినియోగించడం వల్ల అంతు చిక్కని వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్యులు సూచిస్తున్నారు. ప్రధానంగా వెన్నెముక, కళ్లు, చర్మ సమస్యలతో పాటు మానసికంగా ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందంటున్నారు. కంప్యూటర్ వినియోగంలో కాస్త జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్య సమస్యలు రావని అంటున్నారు.

కంప్యూటర్ విజన్ సిండ్రోమ్



- స్క్రీన్‌ను ఎక్కువగా చూడడం వల్ల కళ్ల అలసట, కళ్లు పొడిబారడం, తలనొప్పి, కళ్లు ఎర్రగా మారడం, కళ్లలో దురద వంటి సమస్యలు వస్తాయి. దీన్నే కంప్యూటర్ విజన్ సిండ్రోమ్ అంటారు.
- స్క్రీన్‌కు కనీసం 25 అంగుళాల దూరం నుంచి చూడడం అలవాటు చేసుకోవాలి.
- మానిటర్ మధ్యభాగం కళ్లతో పోల్చినప్పుడు 4 నుంచి 6 అంగుళాలు కిందికి వుండాలి.
- దీని వల్ల కంటిపాపను కనురెప్పలు కొంతవరకు కప్పి ఉంచుతాయి.
- 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువుల వైపు 20 సెకన్ల పాటు దృష్టి సారించాలి.

ఆర్ఎస్ఐ




- ఒకే విధమైన పనిని ఎడతెరిపి లేకుండా చేస్తుండడం వల్ల కండరాలపై ఒత్తిడి పెరిగి నరాలు పట్టుకోల్పోవడం, చచ్చుపడిపోవడం వంటి లక్షణాలు కనిపించడాన్ని ఆర్ఎస్ఐ అంటారు.
- ఉదాహరణకి కంప్యూటర్ కీబోర్డ్‌తో అదేపనిగా టైప్ చేయడం వల్ల చేతివేళ్లకి ఈ వ్యాధి వచ్చే అవకాశం ఉంది.
- చేతి మధ్య నుంచి మణికట్టు ద్వారా వెళ్లే నరంపై ఒత్తిడి పెరగడం వల్ల చేతిలో సూదులతో గుచ్చుతున్నట్లుగా బాధ కలగడం, స్పర్శజ్ఞానం కోల్పోవడం, వస్తువులను పట్టుకోలేకపోవడం వంటి లక్షణాలను సీటీఎస్‌గా పరిగణిస్తారు.
- చేతులకే కాక శరీరంలోని ఏ భాగంలోనైనా ఈ వ్యాధి లక్షణాలు కనిపించవచ్చు. ముఖ్యంగా భుజాలు, మెడలోని కండరాలు, అరికాళ్లు, మోకాళ్లు, నడుము భాగంలో ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి.

టెక్నోస్ట్రెస్

అతిగా కంప్యూటర్ వినియోగించే వారిలో ఒక రకమైన టెన్షన్, అసహనం, ఇతరులపై సానుభూతి లోపించడం, భావోద్వేగాలకు లోనుకాకపోవడం, మెషీన్‌లా పనిచేయడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువగా కంప్యూటర్ వినియోగించే వారిలో ఈ ప్రభావం కనిపిస్తుంది. దీనినే టెక్నోస్ట్రెస్ అంటారు.

టోయస్ట్ స్కిన్ సిండ్రోమ్



ల్యాప్‌టాప్ వాడేవారికి 'టొయస్ట్ స్కిన్ సిండ్రోమ్' అనే చర్మవ్యాధి సోకే ప్రమాదం ఉంది. ల్యాప్‌టాప్‌ను గంటల కొద్దీ కాళ్లపై పెట్టుకొని పనిచేయడం వల్ల ఈ వ్యాధి వచ్చి చర్మం అసాధారణంగా కనిపిస్తుంది. ల్యాప్‌టాప్ నుంచి వెలువడే వేడి వల్ల కొన్నిసార్లు స్కిన్ క్యాన్సర్ వచ్చే అవకాశం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు..

- కంప్యూటర్, ల్యాప్‌టాప్ ముందు కూర్చునే పొజిషన్ విషయంలో జాగ్రత్తలు పాటించాలి. కుర్చీలో పూర్తిగా వెనక్కి జరిగి వెన్నెముకను కుర్చీ వెనుక భాగానికి ఆనించి వెన్ను నిటారుగా ఉండేలా చూసుకోవాలి. ప్రతి అరగంటకోసారి భంగిమను గమనిస్తుండాలి.
- సాధారణంగా తల బరువు నాలుగైదు కిలోలు ఉంటుంది. తలను మెడపై సరిగ్గా బ్యాలెన్స్ చేయగలిగితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలాకాకుండా తరచూ ముందుకు, వెనక్కి వంచి ఉంచడం మెడ మీద అదనపు భారం పడుతుంది. దీనివల్ల క్రమంగా మెడనొప్పి, వెన్ను నొప్పి వంటి సమస్యలు వస్తాయి.
- అలాగే పడుకుని ఎత్తైన దిండు తలకింద పెట్టుకుని ల్యాప్‌టాప్, మొబైల్ చూస్తుంటారు. దీని వల్ల కూడా సమస్యలు తప్పవు. కళ్లకు నిటారుగా స్క్రీన్ ఉండేలా చూసుకుంటే మెడ పొజిషన్ ఆటోమేటిక్‌గా నిటారుగా ఉంటుంది.
- టైప్ చేయడం కోసం వేళ్లను ఎక్కువగా కదిలించాల్సి ఉంటుంది. ఇలాంటప్పుడు వేళ్లపై ఎక్కువ భారం పడకూడదంటే ప్రతి అరగంటకోసారి వేళ్లకు విశ్రాంతి ఇవ్వాలి.
- గంటల తరబడి వర్క్ చేసేటప్పుడు ఏదైనా అవయవంపై ఒత్తిడి పడినట్లు గమనిస్తే.. శరీరం పొజిషన్ తప్పుగా ఉందని అర్థం చేసుకోవాలి. అవయవాలు ఒత్తిడికి లోనవ్వకుండా, కళ్లు ఒత్తిడికి గురి కాకుండా పనిచేయడం అలవాటు చేసుకోవాలి.



పొజిషన్ మార్చుతుండాలి..



కంప్యూటర్, ల్యాప్‌టాప్‌పై పనిచేసేవారు ప్రతి 20 నిమిషాలకు ఒక సారి వారి పొజిషన్ మారుతూ రిలాక్స్ అవ్వాలి. మోకాళ్లు, పక్కటెముకలు కనీసంగా 90 డిగ్రీలు పొజిషన్‌లో ఉంచాలి. వెన్నెముక నిటారుగా ఉంచుతూ పనిచేయాలి. ఏదైనా సమస్య వస్తే తక్షణమే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ ఎస్.వి.రాజేష్, ఆర్థోపెడిక్, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

రాత్రిపూట మానుకోవాలి

అదే పనిగా కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లో పని చేసే వారికి ప్రధానంగా కళ్ల సమస్యలు అతి వేగంగా వస్తాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో పనిచేసి కళ్లకు ఒత్తిడి పెంచడం మంచిది కాదు. ప్రతి గంటకు ఒక సారి కళ్లకు విశ్రాంతి ఇవ్వాలి. అలాగే సమయానికి ఆహారం తీసుకోవాలి. కళ్లకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే వైద్యుల సలహాలను తీసుకోవాలి.

– డాక్టర్ ఎ.శ్రీరాములు, కంటి వైద్య నిపుణుడు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, టెక్కలి

చక్రతీర్థ స్నానాలకు ముమ్మర ఏర్పాట్లు



నదిలో బారికేడ్లు

జలుమూరు, ఎల్ఎన్ పేట: శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు శుక్రవారం వంశధార నదిలో జరగనున్న స్వామివారి త్రిశూల్ చక్ర తీర్థ స్నానాల పుణ్యక్రతువుకు పూర్తిస్థాయి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని టెక్కలి డీఎస్పీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ఆర్ మూర్తి గురువారం తెలిపారు. ప్రధాన ఆలయం నుంచి మధ్యాహ్నం 12 గంటల తర్వాత స్వామి ఉత్సవ మూర్తులను నదికి తీసుకెళ్లనున్నట్లు ఈఓ ప్రభాకరరావు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నదిలో రెండువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు రోడ్లు భవనాల శాఖ అధికారులు తెలిపారు. ఉత్సవమూర్తులను నదికి తీసుకెళ్లే సమయంలో 50 నుంచి 55 వరకూ రోప్ పార్టీలు వినియోగిస్తున్నామని, అలాగే నదికి ఇటు 480 మంది అటు సరుబుజ్జిలి వైపు 450 మందితోపాటు అదనంగా 140 మందిని వినియోగించనున్నట్లు తెలిపారు. మిరాయపల్లి రేవులో పుణ్యస్నానాలు జరిగే సమయంలో భక్తుల రద్దీ, అల్లరిమూకల నిలుపుదల, శ్రీముఖలింగం గ్రామానికి రెండువైపులా ట్రాఫిక్ నియంత్రణ, పుణ్యస్నానాలు అనంతరం భక్తులు తిరిగి వారి స్వగ్రామాలకు చేర్చడం ప్రధానమని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. నది మార్గం కూడా ధూళి, దుమ్ము రేగకుండా ట్రాక్టరలతో నీరు చల్లేందుకు చర్యలు తీసుకున్నట్లు పంచాయతీ విస్తరణ అధికారి ఉమా మహేశ్వరరావు తెలిపారు. అలాగే వైద్య శిబిరం కూడా కొనసాగుతుందని అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తాడేల శ్రీకాంత్ తెలిపారు.

మల్లన్నకు భస్మాభిషేకం



టెక్కలి మండలం రావివలస ఎండల మల్లన్నకు భస్మాభిషేకం చేస్తున్న ఈఓ, అర్చకులు

టెక్కలి: టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం భస్మాభిషేకం నిర్వహించారు. ఈఓ జి.గురునాథ రావు పర్యవేక్షణలో అర్చకులు రామకృష్ణ, మోహన్‌రావు, యుగంధర్ నేతృత్వంలో మల్లన్నకు విభూదితో అభిషేకం చేశారు.



వంశధార గొట్టా బ్యారేజీ పై నిరసన తెలుపుతున్న రైతులు

- గొట్టా బ్యారేజీ నుంచి 100 క్యూసెక్కుల నీరు విడుదల
- ఆందోళన చేసిన నదితీర గ్రామాల ప్రజలు

హిరమండలం: ఏటా రబీ కోసం గొట్టా బ్యారేజీలో నీరు నిల్వ ఉంచి విడుదల చేస్తుంటారు. కానీ ఈ ఏడాది అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం శాపంగా మారింది. కొన్నాళ్ల కిందట రబీ కోసం కుడి, ఎడమ కాలువల ద్వారా నీరు విడిచిపెట్టినా.. కొద్ది రోజులుగా కాలువలకు గేట్లు వేసేశారు. శ్రీముఖలింగేశ్వరుని చక్రతీర్థ స్నానం కోసం గొట్టా బ్యారేజీ వద్ద స్థిరీకరించిన నీటిలో గురువారం 100 క్యూసెక్కులకు పైగా కిందకు విడిచిపెట్టారు. దీంతో ఎడమ ప్రధాన కాలువ పరిధిలోని మహాలక్ష్మీపురం, భగీరథపురం, సీలాదేవిపురం పిండ్రువాడ, అంబావల్లి, రెల్లివలసతో పాటు సుమారు 13 గ్రామాల ఆయకట్టు రైతులు గురువారం రాత్రి గొట్టా బ్యారేజీపై ఆందోళనకు దిగారు. ఏటా చక్రతీర్థ స్నానాలకు నీరు విడిచిపెట్టినా రైతుల అవసరాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చేవారని, కానీ ఈ ఏడాది ఏకపక్షంగా చక్రతీర్థస్నానాలకు 100 క్యూసెక్కుల నీటిని గేట్లు ఎత్తివేసి కిందకు విడిచిపెట్టారని, ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని 13 గ్రామాల రైతులు ప్రశ్నించారు. దీంతో హిరమండలం వంశధార కార్యాలయం ఎదుట ఉద్రిక్తత నెలకొంది. ఒడిశాలో అనుకున్నంతగా వానలు లేక నదికి ఇన్ ఫ్లో రాలేదని, రబీకి నీరివ్వడం కష్టమైపోయిన దశలో వంద క్యూసెక్కుల నీటిని చక్రతీర్థ స్నానాలకు విడిచిపెట్టడం తగదని అన్నారు. దీంతో వంశధార సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం వేకువజామున గేట్లు మూసివేస్తామని చెప్పడంతో రైతులు వెనుతిరిగారు. దీనిపై కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులకు వినతిని అందిస్తామని రైతులు తెలిపారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్

94.72%



ఓటు హక్కు వినియోగించుకుంటూ..



పోలింగ్ కేంద్రం వద్ద పరిస్థితిని తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

- 31 కేంద్రాల్లో ప్రశాంతంగా పోలింగ్
- ఓటుహక్కును వినియోగించుకున్న 4,769మంది ఉపాధ్యాయులు

శ్రీకాకుళం:

ఉత్తరాంధ్ర జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో గురువారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. జిల్లాలో 5,035 మంది ఓటర్లు కాగా 4,769 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లాలో 94.72 శాతం పోలింగ్ జరిగింది. 5,035 మంది ఓటర్లలో 3,416 మంది పురుషులు కాగా వీరిలో 3,247 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,619 మంది మహిళల్లో 1,522 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం డివిజన్‌లో 2878 మంది ఓటర్లకు గాను 2700 మంది, టెక్కలి డివిజన్‌లో 1053 మందికి గాను 1008 మంది, పలాస డివిజన్‌లో 1104 మందికి గాను 1061 మంది ఓటు వేశారు. శ్రీకాకుళం డివిజన్‌లో 1838 మంది పురుషుల్లో 1734 మంది, 1040 మంది మహిళల్లో 966 మంది ఓటు వేశారు. టెక్కలి డివిజన్‌లో 780 మంది పురుషుల్లో 750 మంది, 273 మంది మహిళల్లో 258 మంది ఓటు వేశారు. పలాస డివిజన్‌లో 792 మంది పురుషుల్లో 763 మంది, 312 మంది మహిళల్లో 298 మంది ఓటు వేశారు. మండలాలు, మున్సిపాలిటీల్లో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలీసు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాల ను పరిశీలించారు. సిబ్బంది, ఓటర్లతో మాట్లాడి పోలింగ్ సరళి, సౌకర్యాలు కోసం తెలుసుకున్నారు. కూటమి ప్రజా ప్రతినిధులు, నాయకులు అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద హడావుడి చేశారు. కొందరు ప్రజాప్రతినిధులు గంటల తరబడి శిబిరాల్లో కాపు కాశారు. ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ ముగిసింది.



ఆమదాలవలస పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్



శ్రీకాకుళం నగరంలో ఎంహెచ్ స్కూల్లో ఎమ్మెల్సీ ఎలక్షన్ సందర్భంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలో నిలుచున్న టీచర్స్



ఓటు వేసిన చింతాడ రవికుమార్



ఓటు హక్కును వినియోగించుకుని వస్తున్న దివ్యాంగ టీచర్

క్లుప్తంగా

జాతరలో యువకుడు అదృశ్యం



మక్కా రామప్రసాద్

పొందూరు: మండలంలోని బాణాం గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు మక్క రామప్రసాద్ మూడు రోజుల క్రితం జరిగిన వత్సవలస యాత్రలో అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులతో కలిసి వత్సవలస వెళ్లిన రామప్రసాద్ కనిపించకుండాపోయాడు. కుటుంబ సభ్యులు వెతికినా కనిపించలేదు. రామప్రసాద్ కొద్ది రోజులుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. యువకుడి అదృశ్యంపై గార, పొందూరు పోలీసు స్టేషన్లలో తండ్రి రమణ ఫిర్యాదు చేశారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పొందూరు: మండలంలోని రాపాక కూడలి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొంచాడ గ్రామానికి చెందిన పల్ల రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. సాయంత్రం రోడ్డు పక్కన రాములు నిల్చొని ఉండగా ట్రాక్టర్ దూసుకొచ్చింది. తప్పించుకునే ప్రయత్నంలో ట్రాక్టర్ టైరు రాము కాలు పైనుంచి వెళ్లింది. దీంతో కాలు నుజ్జునుజ్జయ్యింది. గాయపడిన రాములును కుటుంబసభ్యులు చికిత్స కోసం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. రాములు భార్య సూరీడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



లక్ష్మణరావు మృతదేహం

పొందూరు: మండలంలోని ఖాజీపేట గ్రామానికి చెందిన పల్ల లక్ష్మణరావు(45) బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మణరావు పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అప్పులు ఎక్కువగా ఉండటంతో బుధవారం రాత్రి తండ్రి అప్పారావుతో మాట్లాడాడు. అనంతరం బావిలో దూకాడు. వెంటనే గ్రామస్తులు స్పందించి బయటకు తీసినా అప్పటికే మృతి చెందాడు. లక్ష్మణరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

డీఎస్సీ-2003 టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలి

జి.సిగడాం : డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని సంఘం జిల్లా కన్వీనర్ మక్క సురేష్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం జి.సిగడాంలో ఆయన మాట్లాడుతూ 2003 నవంబర్13న అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైందని, 2004 సెప్టెంబర్ 1 ముందే నియామకాలు జరిగాయని చెప్పారు. అప్పట్లో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ (ఓపీఎస్) అమలు చేయాలన్నారు. అలాకాకుండా సీపీఎస్‌లో చేర్పించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం మోమో 57 ప్రకారం 2004 ముందు నోటిఫికేషన్ ద్వారా ఎంపికైన ఉద్యోగులందరికీ పాత పెన్షన్ అమలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మొయ్యి జనార్దనరావు, బెవర సూరపనాయుడు, చదువుల టార్జానబాబు, వల్లూరు రమణ పాల్గొన్నారు.

చక్రధరుని డోలోత్సవాలకు వేళాయె..




శ్రీదేవీభూదేవీ సమేత చక్రపెరుమాళ్‌స్వామి

కవిటి: భక్తుల కోర్కెలు తీర్చే భక్తవత్సలుడిగా, భక్తుల పాలిట కొంగుబంగారంగా బెజ్జిపుట్టుగలో వెలసిన శ్రీచక్రధర పెరుమాళ్ స్వామి ఆలయం డోలోత్సవాలకు సిద్ధమైంది. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా 14 రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశారాష్ట్ర గ్రామాలకు చెందిన పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి మొదలు పౌర్ణమి వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ ఏడాది డోలోత్సవాలు శనివారం ప్రారంభమై మార్చి 14 వరకు కొనసాగనున్నాయి.

- ప్రతి రోజూ మొదటి మూడు రోజులు విజయవాడకు చెందిన యండమూరి శిఖామణి భాగవతారిణి, తర్వాత మూడు రోజులు రాజమండ్రికి చెందిన పురాణం విజయలక్ష్మి భాగవతారిణి చివరి ఎనిమిదిరోజులు బందరుకు చెందిన మడమల రాంబాబు భాగవతార్ ప్రతీ రోజూ రాత్రి 8 గంటలకు హరికథాగానం నిర్వహించనున్నారు.ఉత్సవాలు జరిగే అన్నిరోజులు పల్లకీసేవ, గరుడవాహన సేవలు నిర్వహిస్తారు. వివిధ గ్రామాలకు చెందిన వారు తమ వంతుగా ఒక రోజు ప్రత్యేక కార్యక్రమాల్ని నిర్వహిస్తారు. ఆలయ అనువంశికధర్మకర్తలు పొందల రామస్వామి, అప్పారావునాయుడుల కుటుంబాల వారు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించనున్నారు. వచ్చే నెల 15న వసంతోత్సవం, డోలోరోహణం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

దర్జా లేని బతుకులు!



- దర్జీలపై రెడీమేడ్ దుస్తుల ఎఫెక్ట్
- ప్రభుత్వం 'చేదోడు' కరువే
- నేడు ప్రపంచ టైలర్ల దినోత్సవం

ఇచ్ఛాపురం రూరల్:

యాంత్రీకరణ, రెడీమేడ్ దుస్తుల విజృంభణతో టైలర్ల పరిస్థితి రోజురోజుకూ అగమ్యగోచరంగా మారుతోంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కుట్టు పనినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి పరిస్థితి దారుణంగా తయారవుతోంది. ఎక్కువ మంది రెడీమేడ్ దుస్తుల వైపే మొగ్గుచూపడం, కుట్టు చార్జీల ధరకే షాపుల్లో దుస్తులు లభించడంతో చాలామంది టైలర్‌షాపులకు వెళ్లడమే మానేశారు. లేడీస్ టైలర్లను మినహాయిస్తే జంట్స్ స్పెషలిస్టుల పరిస్థితి మాత్రం దయనీయంగానే ఉంది.



టైలరింగ్ షాప్

పట్టించుకోని పాలకులు..

జిల్లాలో సుమారు పాతిక వేల మంది టైలర్లు జీవనోపాధి పొందుతున్నారు. వీరిలో షాపులు నిర్వహిస్తున్న వారితో పాటు ఇంటి వద్ద దుస్తులు కుట్టే లేడీస్ టైలర్లు కూడా ఉన్నారు. ఎన్నో ఏళ్లగా కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న దర్జీలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల పాటు వరుసగా 'వైఎస్సార్ చేదోడు' పథకం ద్వారా ఏడాదికి పది వేల రూపాయల చొప్పున ఆర్థికసాయం అందించారు. వారికి చేదోడుగా నిలిచారు. దీంతో అప్పట్లో దర్జీ వృత్తి వదలి ఇతర పనులకు వెళ్లిన వారంతా మళ్లీ కుట్టు పనులు చేసుకుండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దర్జీలను పట్టించుకునే వారే కరువయ్యారు. చేదోడు వంటి సాయం కూడా అందక నిన్నటి వరకు దర్జీలుగా పనిచేసిన వారంతా మరల కూలి పనులకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనుమరుగవుతున్న మిషన్లు..

నేడు వయసుతో సంబంధం లేకుండా అందరికీ రెడీమెడ్ దుస్తులు అందుబాటులోకి ఉండేలా ఫ్యాషన్ డ్రెస్ ఉత్పత్తుల పరిశ్రమలు వెలిశాయి. కొత్త కొత్త డిజైన్లతో టీ షర్ట్, జీన్స్ ఫ్యాంట్లు, షాట్లు, రకరకాల దుస్తులు మార్కెట్‌లోకి వచ్చాయి. యువత ఆసక్తిని ఆదాయ వనరుగా మార్చుకోవడానికి పెద్ద కంపెనీలు నగరాలతో పాటు పట్టణాలు, పల్లెల్లో విస్తరించాయి. దీంతో ఎక్కువ మంది రెడీమెడ్‌పై మక్కువ చూపుతుండటంతో టైలర్లకు ఉపాధి కరువవుతోంది. అంతేకాక దుస్తుల తయారీ ముడి సరుకు ధరలు పెరగడంతో గిట్టుబాటు కాక దర్జీలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెడీమేడ్ రాకతో ఉపాధి కోల్పోయిన టైలర్లకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటల్స్, ఇతర ప్రభుత్వ రంగాలలో యూనిఫాం వంటి పనులు ఇచ్చేందుకు పాలకులు చొరవ తీసుకోవాలి. గత ప్రభుత్వం అందించిన 'వైఎస్సార్ చేదోడు' మాదిరిగా ఏడాదికి పది వేల రూపాయలు చొప్పున కూటమి ప్రభుత్వం అందజేయాలి

– దున్న జోగారావు, టైలర్, డొంకూరు

ఆదరణ కరువవుతోంది..



40 ఏళ్ల పాటు టైలరింగ్ వృత్తిలో కొనసాగుతూ వస్తున్నాను. రెడీమెడ్ పుణ్యమానికి రోజుకు కాఫీ ఖర్చుకు మినహాయించి మావద్ద కుట్టించుకునేవారు బాగా తగ్గిపోయారు. ఇదే వృత్తిని నమ్ముకొని, మరో పని తెలియక జీవనం సాగిస్తున్నవారిని ప్రభుత్వం ఆదుకోవాలి. ఉచిత కరెంట్, హెల్త్ కార్డులు, కుట్టు మిషన్, అందించి విధాలుగా ఆదుకోవాలి.

– లాబాల జనార్దన చౌదరి, టైలర్, ఈదుపురం

ప్రభుత్వ తీరు బాధాకరం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: రాష్ట్రంలో చట్టసభల ప్రతిష్ఠను దిగజార్చేలా సభల నిర్వహణ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం ఎంత వరకు భావ్యమని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రశ్నించారు. గురువారం కొత్తపుట్టుగలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్ సమావేశాలలో భాగంగా తొలిరోజు రాష్ట్ర గవర్నర్ ప్రసంగ నివేదికను సిద్ధం చేసిన ప్రభుత్వ యంత్రాంగం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రసంగం నివేదికలో ప్రభుత్వం పొందుపరిచిన అంశాలు అర్ధసత్యంగా ఉన్నాయన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ కేటాయింపుల విషయంలోగానీ, నివేదికలో ప్రస్తావించిన అంశంలో గానీ పారదర్శకతకు పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తు చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదాను వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రకటించకపోవడం ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తారనే అభద్రతాభావమే కారణమన్నారు. ప్రజల గొంతుకలా నిలిచే ప్రతిపక్ష పాత్రను నిర్వీర్యం చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వ పాలన తీరును ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్య విలువల్ని గుర్తించాలని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు.

తమ్ముడు కోసం తప్పుడు మార్గం

- జనవరిలో గంజాయి రవాణా చేస్తూ జైలుపాలైన యువకుడు
- అతడ్ని విడిపించేందుకు గంజాయినే నమ్ముకున్న సోదరుడు
- పట్టుకున్న ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు
- 47.480 కేజీల గంజాయి సీజ్
- మరో ఐదుగురు నిందితులూ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వి.వెంకటఅప్పారావు, సీఐ మీసాల చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు పట్టుబడిన తమ్ముడిని విడిపించేందుకు అన్న కూడా గంజాయి బాటే పట్టాడు. ఈ క్రమంలో తోటి యువకులతో కలిసి ఇచ్ఛాపురం పోలీసులకు పట్టుబడ్డాడు. ఒడిశా నుంచి కేరళ రాష్ట్రంలోని ఖాయంకూలమ్ ప్రాంతానికి అక్రమంగా గంజాయి తరలిస్తుండగా ఈ ఆరుగురు ముఠా సభ్యులను ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఇచ్ఛాపురం సీఐ కార్యాలయంలో గురువారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా మోహనబ్లాక్ గోవిందపూర్ గ్రామానికి చెందిన మైఖేల్ సబర్, సుమంతా సబర్, సుఖాంత్ సబర్, తౌతా గమాంగ, బబులా గమాంగ, చిమిడిహిల్ పంచాయతీ సింగిపూర్ గ్రామానికి చెందిన ప్రకాష్ గమంగలు మోహన బ్లాక్ సమీపంలోని కొండప్రాంతం వద్ద 47.480 కేజీల గంజాయిని కొనుగోలు చేశారు. ఆరు ప్యాకెట్లుగా విభజించి 5 లగేజ్ బ్యాగ్, ఒక ట్రావెలింగ్ సూట్‌కేస్‌లో పెట్టి బరంపురం వచ్చారు. అక్కడి నుంచి బుధవారం బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నారు. అనంతరం కేరళ రాష్ట్రం ఖాయంకూలమ్ ప్రాంతానికి తీసుకెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కి వెళ్తుండగా ఇచ్ఛాపురం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి గంజాయి, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు.

తమ్ముడిని విడిపించేందుకు..

నిందితులు గంజాయిని ఒడిశాలో కేజీ రూ.2వేలుకు కొనుగోలు చేసి కేరళలోని దుర్గకు అప్పగిస్తే అతను కేజీకి రూ.8వేలు చొప్పున అప్పగించేవాడు. ఈ క్రమంలో మైఖేల్ సబర్ తమ్ముడు సిమన్ సబర్ జనవరిలో గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని విడిపించడానికి డబ్బులు అవసరం కావడంతో మైఖేల్ కూడా గంజాయి రవాణా చేసేందుకు సిద్ధమైనట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. కార్యక్రమంలో సీఐ మీసాల చిన్నంనాయుడు, పట్టణ ఎస్సై ముకుందరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దంపతులను ఢీకొట్టిన అంబులెన్స్

- భర్త మృతి.. భార్యకు గాయాలు
- దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం



సూర్యారావు మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా.. భార్య తీవ్ర గాయాలపాలైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం నగరంలోని మధునగర్‌లో నివాసముంటున్న కుందు సూర్యారావు (56), సావిత్రి దంపతులు గురువారం ఉదయం విజయనగరం జిల్లా రామతీర్థాలు పుణ్యక్షేత్రానికి వెళ్లారు. దర్శనం పూర్తి చేసుకొని బైక్‌పై తిరిగి వస్తుండగా ఎచ్చెర్ల బైపాస్ రోడ్డు వద్ద వెనుక నుంచి అంబులెన్స్ ఢీకొట్టింది. హైదరాబాద్ నుంచి పశ్చిమబెంగాళ్ వెళ్తున్న అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సూర్యారావు మృతిచెందగా.. భార్య ఐసీయూలో చికిత్స పొందుతోంది. ఎస్సై వి.సందీప్‌కుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రిమ్స్ లో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు



మృతుడు కోదండరావును పరీక్షిస్తున్న వైద్యుడు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో ఓ వైన్‌షాపు ఎదుట గురువారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఒకటో పట్టణ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నానికి చెందిన మైలపల్లి కోదండరావు కొంతకాలంగా నగరంలోని దమ్మల వీధిలోని తన బావ ఇంట్లో ఉంటూ ఫ్రూట్ షాప్‌లో పనిచేస్తున్నాడు. భార్యతో విడిపోయాడు. రెండురోజులుగా ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పనికి వెళ్లలేదు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం చినబజారు జంక్షన్ వద్ద కళ్లు తిరిగి పడిపోయాడు. అక్కడినుంచి నడుచుకుంటూ వైన్‌షాపున వెళ్లే క్రమంలో దగ్గరలోనే ఫిట్స్ వచ్చి చనిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న డిపో అధ్యక్ష, కార్యదర్శులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం ఆర్టీసీ రెండో డిపోలో ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 28 నుంచి ఆందోళనలు చేపడతామని ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్ష కార్యదర్శులు బి.ఎస్.బాబు, వై.దుర్గారావు డిమాండ్ చేశారు. డిపో కార్యాలయ ఆవరణలో గురువారం వారు మాట్లాడుతూ స్పేర్ ఉన్న డ్రైవర్ కండక్టర్లతో రిటైర్మెంట్ అయిన ఉద్యోగుల ఖాళీలను డ్యూటీ చార్ట్ భర్తీ చేయకపోవడం వల్ల డ్రైవర్, కండక్టర్లు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై యాజమాన్యంతో మాట్లాడినా ఫలితం లేకపోయిందన్నారు. ఏడీసీ సఫలింగ్ చేయడం లేదని, అక్రమ చార్జిషీట్లు, అక్రమ పనిష్మెంట్లు ఇస్తున్నారని, 1/19 సర్క్యులర్ అమలు చేయట్లేదని, మహిళా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం లేదని, అసిస్టెంట్ మేనేజర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, చార్టు వేయకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. వీటికి నిరసనగా శుక్రవారం ఎర్ర బ్యాడ్జీలతో ఉద్యోగులు విధులకు హాజరై నిరసన తెలియజేస్తామన్నారు. సమావేశంలో ఈయూ నాయకులు కె.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అనుమానాస్పద మృతి

- విజయనగరంలో ఘటన.. చినరావుపల్లిలో విషాదం



అన్నెపు లోకేష్ (ఫైల్)



రోదిస్తున్న తల్లి అమ్మాజమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్ : ఆదుకుంటాడనుకున్న కొడుకు అనంత లోకాలకు వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. పొరుగు జిల్లాలో డిగ్రీ చదువుతున్న కుమారుడు మృతి చెందాడన్న వార్త విని శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎచ్చెర్ల మండలం చిన్నరావుపల్లి గ్రామానికి చెందిన అన్నెపు గణేష్, అమ్మాజమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సంతోష్‌కుమార్ డిగ్రీ పూర్తయి ఉద్యోగ వేటలో ఉండగా, చిన్న కుమారుడు లోకేష్ విజయనగరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఫస్టియర్ చదువుతున్నాడు. ఒక వైపు డిగ్రీ చదువుతూనే మరోవైపు రక్షణ రంగంలో ఉద్యోగాల కోసం స్నేహితులతో కలిసి రూమ్ అద్దెకు తీసుకొని కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ నెల 26న మధ్యాహ్నం 12 గంటల సమయంలో లోకేష్ స్నేహితులు సంతోష్‌కు ఫోన్ చేసి తమ్ముడు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడంతో విషాదంలో మునిగిపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు విజయనగరం బయలుదేరారు. అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో కుమారుడి మృతదేహాన్ని చూసి తండ్రి భోరున విలపించాడు. తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదంటూ విజయనగరం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు లోకేష్ స్నేహితులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సెల్‌ఫోన్ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి 1.30 నుంచి 3 గంటల మధ్య మృతి జరిగినట్టుగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పంచనామా నిర్వహించిన వైద్యులు సైతం సస్పెక్టెడ్ డెత్ అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఇటీవల తన తరగతికే చెందిన ఓ విద్యార్థిని లోకేష్ ఇష్టపడినట్టుగా సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఇదే సమయంలో మరో యువకుడు కూడా అదే అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు స్నేహితుల ద్వారా తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో లోకేష్ మృతి మిస్టరీగా మారింది. పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం.

చెరువు గట్టు తవ్వకం అక్రమమే

- కదిలిన అధికార గణం
- మళ్లీ కొబ్బరి మొక్కలను నాటించిన వైనం



కోష్టలోని కృష్ణమ్మ చెరువును పరిశీలిస్తున్న అధికారులు

రణస్థలం: మండలంలోని కోష్ట పంచాయతీలో కృష్ణమ్మ చెరువు(కోనేరు)పై గట్టు తవ్వేసి కొబ్బరి మొక్కలు తొలగించడం అక్రమమేనని అధికారులు స్పష్టం చేశారు. 'అంతా నా ఇష్టం' పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం గురువారం కదిలింది. కృష్ణమ్మ చెరువును పరిశీలించి మట్టి తొలగింపునకు గల కారణాలు అన్వేషించారు. మట్టి తరలింపునకు బాధ్యుడైన టీడీపీ నాయకుడు పిసిని జగన్నాథం సమక్షంలో అధికారులు చెరువును పరిశీలించారు. అతని పొలానికి మట్టి తరలించినట్లు గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. శ్మశాన వాటికకు రోడ్డు వేసేందుకు మట్టి తీసి తన పొలంలో వేసుకున్నానని జగన్నాథం చెప్పినట్లు అధికారులు వివరించారు. అయితే శ్మశాన వాటిక చెరువు నుంచి చాలా దూరంలో ఉంది. రోడ్డు వేయాలన్నా 15 మందికి పైగా జిరాయితీ రైతుల నుంచి భూమిని సేకరించాల్సి ఉంది. ఇలా పొంతన లేని సమాధానం చెప్పడంతో నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో కొబ్బరి మొక్కలు తిరిగి నాటించారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి ులకలాపు అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ఆర్.శ్రీధర్, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో ఎం.శ్రీనివాసనాయుడు, జేఈ గౌరి కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఏ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా



కోడూరు జీడిమామిడితోటలో ఎర్రమట్టిని తరలించుకుపోయిన అక్రమార్కులు

- ఎర్రమట్టి దిబ్బల్లో యథేచ్ఛగా తవ్వకాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన అధికారులు

పోలాకి:

మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. విలువైన ఎర్ర ఇసుకమట్టిని అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 15–4 లో 48 ఎకరాల విస్తీర్ణంలో మండలపరిషత్ ఆధీనంలో ఉన్న జీడిమామిడి తోటలో ఒక్కరోజే వందల ట్రాక్టర్ల మట్టిని ఎత్తేశారని ఈ నెల 14న 'సాక్షి' వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే. మట్టి తరలింపు సర్వత్రా చర్చనీయాంశంగా మారడంతో గురువారం ఎంపీడీవో జి.వి.రవికుమార్, సూపరింటెండెంట్ సూర్యప్రకాశ్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఎర్రమట్టి దిబ్బలు కనుమరుగవుతున్న తీరును గుర్తించి ఆశ్చర్యపోయారు.

ఎర్రమట్టికి డిమాండ్

కోడూరు పరిసర ప్రాంతాల్లో లభించే ఎర్రమట్టికి డిమాండ్ ఎక్కువ. సముద్ర తీర ప్రాంతానికి దగ్గర్లో వున్న సారవంతమైన ఇసుకతో కూడిన మట్టి కావటంతో అందరి కన్నూ దీనిపైనే పడింది. రియల్ ఎస్టేట్ ముసుగులో అక్రమంగా లేఅవుట్లు వేసి ఈ మట్టితో పంటపొలాలను చదును చేస్తుండటంతో మరింత డిమాండ్ పెరిగింది. ఈ మట్టిలో ఎలాంటి మొక్కవేసినా ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. అందుకే ఈమట్టిని ఎర్రబంగారంగా చెప్పుకుంటారు. ఇలాంటి మట్టిని నేరుగా జేసీబీలు పెట్టి అక్రమంగా తరలించుకుపోతూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



గోతులను పరిశీలిస్తున్న ఎంపీడీవో, మండల పరిషత్ సిబ్బంది

దోపిడీని అడ్డుకోవాలి

మండల పరిషత్ ఆధీనంలో ఉన్న జీడితోటలో మట్టి తవ్వకాలు జరిపి దోపిడీకి పాల్పడుతున్న మాఫియాను అడ్డుకోవాలని అధికారులకు చెప్పాం. ప్రస్తుతానికి పూత దశలో వున్న జీడిమామిడి తోటలో మట్టి తీసేయటం వల్ల పంటనష్టం జరిగే అవకాశం ఎక్కువ. మట్టిని తరలించిన యంత్రాలు, ట్రాక్టర్ల వివరాలను రెవెన్యూ, పోలీసులకు తెలియపరిచాం. ఉద్దేశపూర్వకంగా మండలపరిషత్ ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలి.

– ముద్దాడ భైరాగినాయుడు, మండల పరిషత్ సలహాదారు, పోలాకి



జీడి తోటల్లో మట్టి తరలింపునకు ఏర్పాటు చేసుకున్న దారి